క్లుప్తంగా

నేడు బాలల చట్టలపై అవగాహన

పార్వతీపురంటౌన్: బాలబాలికలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20న అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెలగాం యంజేపీ స్కూల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు న్యాయపరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బాలబాలికలు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నారాయణరావు, ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ప్రతీ మొబైల్‌కు లింక్‌లు వస్తున్నాయని, అనవసరంగా లింకులు టచ్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దని సూచించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీలు ఇతరులకు తెలపరాదన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పాచిపెంటలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పాచిపెంట: మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో మంగళవారం విజయనగరానికి చెందిన వికాస్ తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహిళల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు, గర్భస్రావం, రొమ్ము క్యాన్సర్, వంటి వ్యాధులకు సంబంధించి తనిఖీలు చేశారు. సుమారు 80 మంది మహిళల నుంచి రక్త నమూనాలు సేకరించి, గుంటూరులో ఉన్న ల్యాబ్‌కు పంపించారు. మిగిలిన వారికి శిబిరంలోనే చికిత్స అందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సరస్వతి శిశుమందిర్ ప్రధాన అధ్యాపకుడు మరడాన సూర్యనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు అడ్డుగూడురి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలి

పాలకొండ: తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత ఆయకట్టుకు మాత్రమే సాగునీరు అందించేలా డిజైన్ చేసినట్లు వస్తున్న విషయమై జలవనరుల శాఖ స్పందించి వివరణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. తూముల నిర్మాణం, ఎత్తిపోతల నిర్మాణం చేపడుతున్నారా.. లేదా... అన్న విషయాన్ని తెలియజేయాలని కోరారు. ఈ ప్రాంతంలో ఎప్పుడో పూర్తి కావాల్సిన కాలువల నిర్మాణం ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు పూర్తి కాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాలువల నిర్మాణం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు కిమిడి రామూర్తి, వావిలపల్లి రమణమూర్తి తదితరులు ఉన్నారు.

సబ్‌జైల్ సందర్శన



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీలు అధికారుల సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ సబ్‌జైలును స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ. విజయరాజుకుమార్‌తో కలసి ఆయన మంగళవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న న్యాయపరమైన సేవలపై ఆరా తీశారు. వారి ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులను ఆదేశించారు. సీజన్ ప్రాప్తికి అవసరమైన జాగ్రత్తలు, వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట హెడ్ వార్డర్ చంద్రరావు, లీగల్ అడ్వైజర్ కుమార్ స్వామితో పాటు హేమసుందర్, సత్యనారాయణ, నర్సింహులు తదితరులు ఉన్నారు.



సౌందర్య జంక్షన్ సమీపంలో ఓ ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ టెన్షన్..!

- పార్వతీపురం పట్టణంలో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య
- ఉదయం, సాయంత్రం వేళలో మరింత జఠిలం
- పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాల నిలిపివేత
- అవస్థలు పడుతున్న పట్టణ వాసులు

పార్వతీపురంటౌన్:

పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఎటుచూసినా వాహనాల రద్దీనే కనిపిస్తోంది. ఉదయం పూట స్కూళ్లు, కళాశాల సమయాల్లో సమస్య మరింత అధికమవుతోంది. పనిమీద బయటకు వచ్చిన వాహనదారులు తమ వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పార్వతీపురం ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఎటుచూసినా దుకాణాల ఎదుట వరుసగా ద్విచక్ర వాహనాలు బారులు తీరి కనిపిస్తుంటాయి.

జిల్లా కేంద్రంగా ఉన్న పార్వతీపురం పట్టణంలో వ్యాపారం, వాణిజ్యం రోజురోజుకు విస్తరిస్తోంది. ప్రతిరోజు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై పాదచారులు వెళ్లడానికి కూడా వీలులేని రీతిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే ప్రధాన రహదారుల్లో ఎక్కడా పార్కింగ్ వ్యవస్థ మాత్రం లేదు. ఆర్టీసీ బస్టాండు నుంచి మొదలు సౌందర్య జంక్షన్, పాతబస్టాండ్ నుంచి పద్మశ్రీ వరకు ప్రధాన రహదారి పొడవునా ఎక్కడా పార్కింగ్ సౌకర్యం లేదు. రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయాల్సి వస్తుంటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. దీంతో పాటు ప్రధాన రహదారిపై తోపుడుబండ్లు, ఆటోలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండటంతో సమస్య జఠిలంగా మారుతోంది.



మోర్ షాపింగ్ మాల్ ఎదుట రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

నిబంధనలకు విరుద్ధంగా..

పట్టణంలోని ప్రధాన రహదారిలోని దుకాణదారులు, హోటళ్లు, ఇతర దుకాణదారులు షాపు ఎదుట కొంత స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం విడిచిపెట్టాల్సి ఉంటుంది. అయితే భవన నిర్మాణ యజమానులు పార్కింగ్ కోసం స్థలం విడిచిపెట్టకుండా నిర్మాణాలు చేపట్టడంతో పాటు రోడ్డు, కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. దుకాణాలకు వచ్చే వారంతా తమ వాహనాలను రోడ్డుపై నిలపాల్సి రావడంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ప్రధాన రహదారితో పాటు పలు ప్రధాన కూడళ్ల వద్ద పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ సమస్య అధికంగా ఉంది

పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్య అధికంగా ఉంది. ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కన ఎక్కడపడితే అక్కడ నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు రహదారిలో ఉన్న దుకాణదారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. పెరిగిన వాహన రాకపోకలకు అనుగుణంగా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– వి.శ్రీనివాసరావు, వాహనచోదకుడు, పార్వతీపురం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది. ఉన్న వసతులతో ట్రాఫిక్ క్రమబద్ధీ కరణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ వాహలు నిలిపివేయకుండా సహకరించాలి. ప్రధాన రహదారి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవు.

– సన్యాసిరావు, ఇన్‌చార్జి కమిషనర్

దాణా తయారీలో స్వయం సమృద్ధి సాధించాలి

- జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు

పార్వతీపురంటౌన్: దాణా తయారీలో రైతులు స్వయం సమృద్ధి సాధించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలోని పశువైద్య కేంద్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం , పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు పాల్గొని పశువులకు తరచూ వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, చికిత్సా విధానం, పశుగ్రాసం సాగు, తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అజోళ్ల, సైలేజ్ తయారీ, సమీకృత దాణాను రైతులు స్వయంగా తయారు చేసుకొనే విధానాన్ని, దాని ప్రాముఖ్యతను వివరించారు. పశువుల పెంపకంలో మెలకువలను, పశు పిండ మార్పిడి(ఐవీఎఫ్) ప్రాముఖ్యతను, లింగ నిర్ధారణ, చూడి ఇంజక్షన్లు, నట్టల నివారణ మందు ఉపయోగాలు వివరించారు. ఈ శిబిరంలో 102 పశువులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.రాధాకృష్ణ, పార్వతీపురం సహాయ సంచాలకులు డాక్టర్ బి.శ్రీనివాసరావు, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ జై కిరణ్, పశు వైద్యులు రామారావు, బి.చక్రధర్, ఉదయ్, ప్రసాద్, సత్యనారాయణ, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అనుజి, గ్రామ పంచాయతీ సర్పంచ్ బంగారం, పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పాడిపశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మన్మథరావు

సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ రామ్‌గోపాల్

పార్వతీపురంటౌన్: సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ రామ్‌గోపాల్ అన్నారు. పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో, ఎంపీడీఓ కె.రూపేష్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులతో మంగళవారం వేరువేరుగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం చేపడుతున్న హౌస్ హోల్డ్ జియో లోకేషన్ సర్వే, ఎన్‌పీసీఐ లింకింగ్, పాఠశాల శానిటేషన్ ఇన్‌స్పెక్షన్, తదితర సర్వేల స్టేటస్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ఉద్యోగుల హాజరు, క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న పనులపై సమీక్షించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ డివైసులు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల సర్వేలు ఆలస్యం అవుతున్నాయని, పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సచివాలయం ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని, ఒకరికొకరు పరస్పరం సహకరించుకుంటూ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలను శతశాతం పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి సూచించారు. తాను త్వరలోనే అన్ని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, రికార్డుల నిర్వహణ, సర్వేల ప్రగతి, అంటెండెన్స్, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మి, డీసీ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ రామ్‌గోపాల్

మంచి సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం

పార్వతీపురంటౌన్:

విద్యార్థి దశలోనే చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, మంచి సమాజాన్ని ఏర్పాటు చేయడంలో విద్యార్థులు కీలకమని పార్వతీపురం టౌన్ పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ బద్నాన శశి అన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా లైంగిక వేధింపులు, ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో ఫేక్, అసభ్యకర మెసేజ్‌లు పోస్ట్ చేసినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆపద, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖకు సంబంధించిన డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని, ప్రతీ విద్యార్థి తమ మొబైల్లో ఉమెన్ సేఫ్టీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, సిబ్బంది, హోంగార్డు అర్చన, తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదుకు సహకరించాలి

భామిని: పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ నమోదుకు అవసరమైన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ నీలాపు అప్పారావును టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం కోరారు. విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీల్లో మార్పులకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. పుట్టిన తేదీల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం నివారించాలన్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి స్థాయి పత్రాలుంటే ఎల్‌బీడీలు మంజూరు సులభతరమవుతుందని తహసీల్దార్ చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు రవినాయుడు, సిర్ల అశోక్, బిడ్డిక ప్రసాద్, భూపతి ప్రభాకర్, కిరణ్ కుమార్ ఉన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట:

మరుగుదొడ్లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని బలిజిపేట సర్పంచ్ రాగలత అన్నారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా బలిజిపేటలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఆరోగ్యం బాగుండాలంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పాఠశాలల వద్ద విద్యార్థులకు టాయిలెట్స్ నిర్మించాలని, వాటికి రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించడంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 సామల సింహాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయిలు, విద్యార్థులు

బహిరంగ మలవిసర్జన మానుకోవాలి

సీతానగరం: బహిరంగ మలవిసర్జన వల్ల వచ్చే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గాదెలవలసలో సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో పాటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల వచ్చే ఆరోగ్య, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గాదెలవలసలో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుమల కేబుల్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు బొన్నాడ తిరుపతిరావు, గ్రామపెద్దలు, ఇంజినీరింగ్ సహాయకుడు జగన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

నూతన బోధనా పద్ధతులు అమలుచేయాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ-1 సింహాచలం

బలిజిపేట: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకుని పాఠశాలల్లో నూతన బోధనా పద్ధతులు అమలుచేయాలని ఎంఈఓ–1 సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతీ ఉపాధ్యాయుడు టీచర్స్ డైరీ, లెసెన్ ప్లాన్స్ తయారుచేసుకోవాలన్నారు. తరగతి గదిలో టీఎల్ఎంను వినియోగించి బోధన చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులందరికీ అపార్ ఐడీలను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఎఫ్ఏ 1, 2 పరీక్షల మార్కులు వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. స్కూల్ గ్రాంట్స్ ఎస్టిమేషన్స్ ఆన్‌లైన్ పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ ఆకస్మిక పరిశీలన

సాలూరు: నియోజకవర్గంలోని సాలూరు, పాచిపెంట మండలాల్లో సబ్‌కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీఓ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పర్యటించారు. సాలూరు పట్టణంలోని వైటీసీలో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని, కొత్తవలస సంక్షేమ ఆశ్రమ పాఠశాలను, పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో కిచెన గార్డెన్ పనులను, కందిరివలస గోకులం షెడ్‌ను పరిశీలించారు. గిరిశిఖర గర్భిణుల వసతిగృహానికి వెళ్లి అక్కడ గర్భిణులకు అందిస్తున్న సదుపాయాలు, వైద్య తనిఖీలపై ఆరా తీశారు. అక్కడ మరుగుదొడ్ల మరమ్మతులకు గురవడాన్ని గుర్తించిన వెంటనే బాగుచేయించాలని ఐటీడీఏ ఈఈ మణిరాజ్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో తమకు జీతాలు బకాయిలు ఉన్నాయని, వాటిని అందివ్వాలని సిబ్బంది పీఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.



పి.కోనవలస గురుకుల పాఠశాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

దీర్ఘకాల రోగాలకు ఆయుర్వేదంతో ఉపశమనం

సీతానగరం: ఆయుష్ మందుల గుణాలపై వైద్య సిబ్బంది, ఆశాలు అవగాహన పెంచుకోవాలని బూర్జ ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ తెర్లి హేమాక్షి అన్నారు. పెదంకలాం పీహెచ్‌సీలో డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంతోనే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముఖ్యంగా మధుమేహ నియంత్రణ, దినచర్య, రుతుచర్య, జీవనశైలి, యోగాపై అవగాహన, పరిసరాలలో లభ్యమయ్యే ఔషధ(వనమూలికలు) మొక్కల ప్రాముఖ్యత, గృహ వైద్యం, తదితర వాటిపై ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆయుష్ మందులు దోహద పడతాయన్నారు. ఆయుర్వేద మందులు, వాటిలో ఉన్న వ్యాధినిరోధక గుణాలను తెలియజేసే పుస్తకాలు, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ జి.సూర్యనారాయణ, హెచ్‌వీ వరలక్ష్మి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆయుర్వేద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమాక్షి

అవయవ దాత అమర్ రహే..



సాయికుమార్ సంతాప ర్యాలీలో పాల్గొన్న యువత

పాచిపెంట: నాలుగు రోజుల కిందట రహదారి ప్రమాదంలో తీవ్ర గాయాలై బ్రెయిన్ డెడ్ అయిన మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన లంకాన సాయికుమార్ అవయవాలను అతని తల్లిదండ్రులు దానం చేసిన సంగతి తెలిసిందే. అయితే అవయవ దానాన్ని హర్షిస్తూ పాచిపెంట మండల కేంద్రంలో మంగళవారం యువత, ప్రజా ప్రతినిధులు, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. సాయికుమార్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. అవయవ దాత సాయికుమార్ చిరస్థాయిగా గుర్తుండిపోతాడన్నారు. అవయవ దానానికి అంగీకరించిన అతని తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆరోగ్య ప్రమాణాలపై వైద్య సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న స్టేట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.రమాదేవి

పార్వతీపురంటౌన్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదించిన జాతీయ నాణ్యతా ప్రమాణాలను ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేయాలని స్టేట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.రమాదేవి స్పష్టం చేశారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సీహెచ్‌ఓలకు స్టేట్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్లు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ప్రజారోగ్యం దృష్ట్యా ఉండాల్సిన మౌలిక సదుపాయాల మెరుగునకు కృషి చేయాలన్నారు. పరిష్కరించాల్సిన అంశాలు ఏమైనా ఉంటే డాక్యుమెంటేషన్ రూపంలో పోర్టల్‌లో ఏవిధంగా అప్‌లోడ్ చేయాలో ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ పొందిన వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు వారి పరిధిలోని వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందికి ఎన్‌క్యూఏఎస్ రీఓరియన్టేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌క్యూఏఎస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.నరేంద్రకుమార్, డీపీఎంఓ డాక్టర్ రఘుకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.